బీజేఆర్ భవన్‌లో ఆధార్ కేంద్రం పునః ప్రారంభం

దిల్‌సుఖ్‌నగర్: కొత్తపేటలోని బాబూజగ్జీవన్ రామ్ (బీజేఆర్) భవనంలో ఆధార్ కేంద్రం మళ్లీ అందుబాటులోకి వచ్చింది.ఇక్కడ ఉన్న ఆధార్ సెంటర్ కొద్ది రోజులుగా పని చేయడం లేదు. అధికారుల కృషితో బీజేఆర్ భవనంలో ఆధార్ సెంటర్‌ను పునఃప్రారంభించారు. ఈ అవకాశాన్ని స్థానికులు ఉపయోగించుకోవాలని ఆధార్ సెంటర్ నిర్వాహకులు బాలరాజ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ కేంద్రం పని చేస్తుందని తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ నం. 9293786007ను సంప్రదించాలన్నారు.

పోలింగ్ సిబ్బందికి శిక్షణ పూర్తి

చాదర్‌ఘాట్: హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని మలక్‌పేట అసెంబ్లీ నియోజకవర్గంలోని 300 పోలింగ్ బూత్‌లలో విధులు నిర్వహించనున్న 500 మంది ఇతర పోలింగ్ సిబ్బందికి శిక్షణ శనివారం సాయంత్రం పూర్తైంది. నియోజకవర్గంలోని ముంతాజ్ ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రతీ బూత్‌లో ముగ్గురు ఇతర పోలింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తారు. పోలింగ్ రోజున ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఓటింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు ఇతర పోలింగ్ సిబ్బంది పాత్ర కీలకమని అధికారులు తెలిపారు. మొదటి విడత నిర్వహించిన శిక్షణలో గైర్హాజరయిన వారికి శనివారం శిక్షణ ఇచ్చామని మలక్‌పేట సర్కిల్–6 డీసీ జయంత్ తెలిపారు.

హనుమాన్ జయంతిని ప్రశాంతంగా జరుపుకోవాలి: సీఐ

చాదర్‌ఘాట్: ఈనెల 23న జరిగే హనుమాన్ జయంతిని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ సైదులు భక్తులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం పీస్ కమిటీ సభ్యులు, హనుమాన్ జయంతి ఉత్సవాల కమిటీ సభ్యులతో స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మలక్‌పేట ఏసీపీ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు.హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను కాపాడి ఇతరులకు ఆదర్శంగా ఉండాలని అన్నారు. పీస్ కమిటీ సభ్యులు, హనుమాన్ జయంతి ఉత్సవాల కమిటీ సభ్యులు అసాంఘికశక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అగంతకుల కదలికలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కమిటీ సభ్యులు, ఎస్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులకు పుస్తకాల పంపిణీ


పుస్తకాలు అందజేస్తున్న దేవేంద్రరావు, లైబ్రేరియన్ పద్మ

వనస్థలిపురం: వనస్థలిపురం ఎన్జీఓస్‌కాలనీలోని శాఖా గ్రంథాలయంలో చదువుకుంటూ పోటీ పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులకు ఉపయోగపడే పుస్తకాలను వెటర్నరీ యూనివర్సిటీ రిటైర్డ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి పి.దేవేంద్ర రావు తన తల్లిదండ్రులు శ్రీరాములు, తులసీ రత్నంల జ్ఞాపకార్థం అందజేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎస్.పద్మ, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ రిటైర్డ్ అధికారి సత్యనారాయణ, వెంకటేశ్వర్ రావు, ప్రసాద్, పుండరీకాక్షుడు, వెంకట్ పాల్గొన్నారు.

శ్రీహిల్స్ కాలనీ కార్యవర్గం ఏడాది పొడిగింపు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలోని శ్రీ హిల్స్ కాలనీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రస్తుతం కొనసాగుతున్న కాలనీ సంక్షేమ సంఘం కార్యవర్గం రెండేళ్లు పూర్తి చేసుకుంది. ప్రస్తుతం ఉన్న కమిటీని మరో ఏడాదిపాటు కొనసాగేలా సంక్షేమ సంఘం ప్రతినిధులు నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి యాదగిరిరావు, కోశాధికారి రవీందర్‌నాయక్, గౌరవ అధ్యక్షుడు గురునాథ్, నాయకులు సత్యనారాయణరావు, మనోహర్‌రావు, రమేష్‌గౌడ్, రమణాచారి, మల్లేష్‌యాదవ్, రవీందర్, వెంకటయ్య, కృష్ణయ్య, రమావత్ తదితరులు ఉన్నారు.

కట్ట మైసమ్మ ఆలయ హుండీల చోరీ

రామంతాపూర్: జాతీయ రహదారి దగ్గర పెద్ద చెరువు కట్టపై ఉన్న శ్రీకట్ట మైసమ్మ ఆలయంలో మూడు హుండీలు ఆదివారం వేకువజామున చోరీకి గురైనట్లు ఆలయ చైర్మన్ బండారి వెంకట్రావు తెలిపారు. భక్తులు హుండీలో వేసే కానుకలను, డబ్బులను ప్రతి మూడు నెలలకు ఒకసారి లెక్కిస్తామని, సుమారు రూ. 70 వేలు చోరీకి గురయ్యాయని అన్నారు. మంగళవారం నుంచి కట్ట మైసమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు నిర్వహించడానికి ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తుండగా ఈ సంఘటన జరగడంతో దిగ్భ్రాంతికి గురయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉప్పల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారని అన్నారు.

భర్తతో గొడవ పడి గర్భిణి అదృశ్యం

ఉప్పల్: భర్తతో గొడవ పడి గర్భిణి అదృశ్యమైన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. రామంతాపూర్ వెంకటరెడ్డినగర్ కు చెందిన సాయి పవన్, అనుష(26)లకు ఏడాది క్రితం పెళ్లైంది. ప్రస్తుతం అనుష అరు నెలల గర్భిణి. పుట్టింటికి వెళ్తానని భర్తతో చెప్పగా భర్త అందుకు అంగీకరించ లేదు. దీంతో భర్త బయటకు వెళ్లగా ఇంటి నుంచి చెప్పకుండా వెళ్లిపోయింది. పుట్టింటికి కూడా వెళ్లలేదు. దీంతో అనుష తండ్రి ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఉద్యోగం రాలేదని యువతి ఆత్మహత్య

ఉప్పల్: ఉద్యోగం రాలేదని యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉప్పల్ ఠాణా పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సాయిరాంనగర్‌కు చెందిన బండపల్లి ఎల్లబాయి కూతురు, అల్లుడు చనిపోవడంతో వారి ఇద్దరు కూతుళ్లు సాత్విక(22), బావిష్క (16)లను తానే పోషిస్తోంది. సాత్విక గత కొద్ది రోజులుగా ఉద్యోగాన్వేషణలో ఉంది. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఉద్యోగం రాకపోవడంతో మనస్తాపం చెంది శనివారం రాత్రి ఇంట్లోని గదిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. అమ్మమ్మ ఎల్లబాయి ఫిర్యాదు మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 19, వంకాయ 23, బెండ 35, పచ్చిమిర్చి 65, కాకర 35, బీర 50, క్యాలీఫ్లవర్18, క్యాబేజీ 23, క్యారెట్ 35. దొండ 33, ఆలు 33, ఉల్లి 19, గోకర 35, దోస 15, సొర 11, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 55, అర్వి 35, మునగ 25, చిలగడదుంప 60, బీట్‌రూట్ 21, కీర 25, ఫ్రెంచ్ బీన్స్ 80, కాప్సికమ్ 60. సోమవారం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

ఆహ్లాదం.. ఆనందం

సందర్శకులను ఆకట్టుకుంటున్న • హరిణ వనస్థలి జాతీయ పార్కు



హరిణ వనస్థలి జాతీయ పార్కు ముఖద్వారం

మన్సూరాబాద్: ఒకప్పుడు నిజాం ప్రభువు షికార్‌ఘర్ (మృగాలను వేటాడే ప్రదేశం) గా ప్రసిద్ధి గాంచిన అభయారణ్యమే నేటి మన్సూరాబాద్ డివిజన్ ఆటోనగర్‌లోని మహావీర్ హరిణ వనస్థలి జాతీయ పార్కు. ఒకపక్క చెంగు చెంగున గంతులేసే లేళ్లు.. కుందేళ్లు..పురి విప్పి నాట్యమాడే నెమళ్లు తదితర జంతువులు.. మరోపక్క పచ్చదనంతో నిండి ఉండే ఈ పార్కు పాఠశాలల విద్యార్థులతో పాటు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. సెలవు రోజుల్లో విద్యార్థులే కాకుండా.. కొద్దిసేపు సేద తీరేందుకు ఉద్యోగులు, వ్యాపారులు తదితరులు తమ కుటుంబ సభ్యులతో ఇక్కడికి వస్తుంటారు. దీంతో ఈ పార్కు సందర్శకులతో నిత్యం కిటకిటలాడుతోంది.

మొత్తం విస్తీర్ణం 1459 హెక్టార్లు..

మహావీర్ హరిణ వనస్థలి జాతీయ పార్కు సుమారు 1459 హెక్టార్లలో విస్తరించి ఉంది. దీనిని నాలుగు భాగాలుగా విభజించారు. ప్రధాన పార్కు 89 హెక్టార్లలో ఉంది. సెక్టారు 1, సెక్టార్ 2– 338హెక్టార్లు, సెక్టార్ 3– 310 హెక్టార్లు, సెక్టార్4– 329 హెక్టార్లలో విస్తరించి ఉంది. ప్రధాన పార్కుకు మాత్రమే సందర్శకులను అనుమతిస్తారు.


సందర్శకులతో కటకిటలాడుతున్న పార్కు


పార్కులో తిరుగుతున్న నెమలి

ప్రధాన జంతువులు

హరిణ వనస్థలి జాతీయ పార్కులోని నాలుగు సెక్టార్లలో జింకలు, కృష్ణజింకలు, దుప్పిలు, నక్కలు, అడవి పందులు, నెమళ్లు, పాములు, పక్షులు, కోతులు, కుందేళ్లు ఉన్నాయి. వీటికి నిరంతరం నీటిని, ఆహారాన్ని అందిస్తు ఉంటారు. పార్కులో వన్యమృగాలను చూసేందుకు ఒక సఫారీ వ్యాన్ కూడా అందుబాటులో ఉంది.

సందర్శన వేళలు..

హరిణ వనస్థలి జాతీయపార్కును ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సందర్శించవచ్చు జూ పార్కుకు ఎంట్రన్స్ ఫీజు రూ.40లు, సఫారీ రూ.70లు.. ఈ రెండు ఛార్జీలు కలిపి రూ.110 వసూలు చేస్తారు. ప్రతి సోమవారం ఈ పార్కుకు సెలవు.

ఇంకా ఏర్పాట్లు చేయాలి



హరిణ వనస్థలి జాతీయ పార్కును చూడటానికి తరచూ వస్తుంటా. విశాలమైన పార్కు కానీ ఏర్పాట్లు సరిగ్గా లేవు. మ్యూజియం మూసివేసి ఉంది. బటర్ ఫ్లై పార్కు కేవలం బోర్డుకే పరిమితమైంది. థీమ్‌పార్కులో ఎండ తీవ్రతతో ఉండలేక పోతున్నాం. పచ్చదనాన్ని కాపాడలేక పోతున్నారు. సఫారీ చేశాను. జంతువులు కూడా తక్కువగా ఉన్నాయి. ఇంకా ఏర్పాట్లు చేస్తే సందర్శకులు పెరుగుతారు. – కీర్తి, సరస్వతినగర్

వన్యప్రాణులకు తాగునీటి ఏర్పాట్లు

వేసవిలో వన్యప్రాణులు తాగునీటికి ఇబ్బంది పడకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. అదనపు నీటి ప్రాంతాలను ఏర్పాటు చేశాం. వేసవి తీవ్రత వల్ల పచ్చదనం ఎండిపోతుంది. సందర్శకులకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. – విష్ణువర్ధన్, రేంజ్ ఆఫీసర్

బీజేపీతోనే పాతబస్తీ అభివృద్ధి


మూసారంబాగ్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, బీజేపీ నాయకులు

మలక్‌పేట: బీజేపీతోనే పాతబస్తీ అభివృద్ధి చెందుతుందని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. బీజేపీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి కొంపెల్ల మాధవీలతను వచ్చే ఎన్నికల్లోగెలిపించాలని కోరుతూ డివిజన్ పరిధిలోని 240, 241 బూత్ అధ్యక్షులు శివ, సంతోష్, కోఆర్డినేటర్లు శశికాంత్, కిరణ్, సభ్యులతో కలిసి కార్పొరేటర్ ఆదివారం ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ..ప్రధాని నరేంద్రమోదీ సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్ నినాదంతో దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారన్నారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని హైదరాబాద్ కాషాయం జెండా ఎగురవేయడం తథ్యమన్నారు. యువత, మహిళలు బీజేపీవైపు మొగ్గు చూపుతున్నారన్నారు. ప్రచారంలో నాయకులు రవి, హేమంత్, విశాల్, దినేష్, రాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నాగేశ్వర్‌రావుకు డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేటిక్స్ విభాగం నుంచి జిల్లపల్లి నాగేశ్వర్‌రావు పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. సీనియర్ అధ్యాపకులు ప్రొ.వీబీ నరసింహా పర్యవేక్షణలో ఇంప్లిమెంటేషన్ ఆఫ్ డీఫ్ లెర్నింగ్ అండ్ కంప్రెషన్ టెక్నిక్స్ ఆన్ హెల్త్ కేర్ సిస్టం ఫర్ ఇంప్రూవ్ డేటా స్టోరేజ్ ఎఫిసైన్సీ అనే అంశం పై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది.

ఘనంగా ప్రసన్నాంజనేయ స్వామి జయంత్యుత్సవాలు


సామూహిక వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

సైదాబాద్: స్థానిక జైల్ గార్డెన్‌లో స్వయంభుగా వెలసిన శ్రీప్రసన్నాంజనేయ స్వామి ఆలయ 52వ వార్షికోత్సవం, స్వామి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు సకల ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ అధ్యక్షుడు కె.జయప్రకాశ్ తెలిపారు. ఆదివారం నుంచి ఈనెల 23 (మంగళవారం) వరకు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. మొదటిరోజైన ఆదివారం గణపతి పూజ, పుణ్యాహ వాచనం, శిఖరపూజ, కలశస్థాపనంతో ప్రత్యేక పూజలు మొదలయ్యాయని తెలిపారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాల్లో పాల్గొన్నారు. రెండవ రోజైన సోమవారం శ్రీకనకదుర్గా అమ్మవారి సన్నిధిలో చండీహోమం నిర్వహిస్తామన్నారు. హనుమాన్ జయంతి రోజైన మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, సామూహిక హనుమాన్ చాలీసా పఠనం, ఊరేగింపు ఉంటాయని జయప్రకాశ్ తెలిపారు. స్వామి పూజల్లో కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ నాగభూషణం, ప్రధానకార్యదర్శి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు ఉమాశంకర్, మదన్‌బాబు, దత్తురావు, కోశాధికారి శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఉప కోశాధికారి పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయం ఖాయం


రామ్మోహన్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన వివిధ పార్టీల నాయకులు

ఎల్‌బీనగర్: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ ఆధ్వర్యంలో బీఎన్‌రెడ్డి నగర్ కాలనీలోని ఆయన నివాసంలో ఆదివారం బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్ రెడ్డి పాల్గొన్నారు. వీరి సమక్షంలో బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలు, పలువురు కుల సంఘాల నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

పర్యాటక కేంద్రంగా వెంకటాపూర్ క్షేత్రం

26 నుంచి శ్రీలక్ష్మీ నారాయణ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు


శ్రీలక్ష్మీ నారాయణ స్వామి ఆలయం

తలకొండపల్లి: శంషాబాద్ విమానాశ్రయానికి 50 కిలో మీటర్ల దూరంలో తలకొండపల్లి మండలంలోని వెంకటాపూర్‌లో వెలిసిన శ్రీలక్ష్మీనారాయణస్వామి దేవాలయం అత్యంత పురాతనమైనది. ప్రకృతి ఒడిలో ఉన్న ఈ ఆలయానికి వచ్చే భక్తులకు మానసిక ప్రశాంతత దొరకడంతో పాటు, ఆధ్యాత్మిక చింతన అలవడుతుంది. ఏటా వేద పండితుల మంత్రోచ్చరణాల నడుమ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ నెల 26న ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉదయం అఖండదీపారాధన, మహాగణపతిపూజ, పుణ్యహవాచనం, మండపారాధనలు, పతాక ఆవిష్కరణ, యజ్ఞహోమాలు, 27న ఉదయం 11.45 గంటలకు శ్రీలక్ష్మీనారాయణ స్వామి కల్యాణ మహోత్సవం, సాయంత్రం బండ్లసేవ, పల్లకీసేవ, 28న తెల్లవారుజామున 3 గంటలకు రథోత్సవం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక తోడ్పాటు

హయత్‌నగర్: కుటుంబ పెద్దను కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓ పేద కుటుంబానికి స్థానికులు చేయూత అందించారు. తుర్కయాంజాల్ మున్సిపాలిటీలోని తొర్రూర్ గ్రామంలో కుమ్మరివాడకు చెందిన వడులాపురం అశోక్ నెల రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన భార్య అనిత ముగ్గురు కుమార్తెలు, కుమారుడితో కలిసి జీవనం సాగిస్తోంది. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధిత కుటుంబానికి కుమ్మరి సంఘం నాయకులు ఆదివా రం రూ.44 వేలు అందించారు. కార్యక్రమంలో ప్రభాకర్, ఎల్లయ్య, బాలరాజు, వెంకటేష్, శ్రీశైలం, మహేశ్వర్, జంగయ్య, బాలయ్య, కుమార్, సంతోష, కలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మహేశ్వరం: గ్రామీణ ప్రాంత పేదలకు ఉచితంగా ఆరోగ్య సేవలు అందిస్తామని కొండేటి ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ మల్లయ్య పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని మంఖాల్ గ్రామంలో తుక్కుగూడ కొండేటి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో బీపీ, షుగర్ పరీక్షలతో పాటు సాధరణ పరీక్షలను సుమారు 300 మందికి నిర్వహించారు. అవసరమైన రోగులకు మందులు పంపిణీ చేశారు.

బీజేపీలో చేరికలు

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్ద అంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలోని పసుమాముల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు చెవుల శ్రీహరి ఆదివారం బీజేపీలో చేరారు. కుంట్లూరు వెంకటేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ సమక్షంలో ఆయనతో పాటు మరికొందరు కాషాయ కండువా కప్పుకొన్నారు.

భార్యతో గొడవ పడి భర్త అదృశ్యం

రామంతాపూర్: ఆర్టీసీ కాలనీకి చెందిన లక్ష్మణ్ (36), భార్య కవితలు ఈ నెల 18 న గొడవపడ్డారు.దీంతో కవిత పుట్టింటికి వెళ్లిపోయింది. తిరిగి 20 న ఇంటికి రావడంతో అప్పటికే భర్త ఇంట్లో లేడు. ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో కవిత ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

మోదీ సర్కార్‌కు భంగపాటు తప్పదు


సమావేశంలో మాట్లాడుతున్న మధుయాష్కీగౌడ్

టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్

చంపాపేట: ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేట్ వ్యక్తులకు, సంస్థలకు విక్రయిస్తూ దేశాన్ని అప్పుల పాల్జేస్తున్న మోదీ సర్కారుకు త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో భంగపాటు తప్పదని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డికి మద్దతుగా ఆదివారం ఆయన చంపాపేట డివిజన్ సాయిరాంనగర్ కాలనీలోని పార్కులో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డితో కలిసి వాకర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుయాష్కీ మాట్లాడుతూ... పదేళ్ల పాలన చేసిన కేసీఆర్ కూడా మళ్లీ తనదే అధికారం అని గర్వపడి భంగపాటుకు గురయ్యారని విమర్శించారు. దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ జరగాలంటే పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ అధికార పగ్గాలు చేపట్టాల్సిందేనని అని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎంపీగా ప్రాతినిథ్యం వహించిన మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాన్ని మళ్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థే కైవసం చేసుకోవటం తథ్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డిని అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అభివృద్ధిలో తమ పాత్ర ఉందని, ఎల్బీనగర్ ప్రజలతో తమకు సత్సంబంధాలు ఉన్నాయని అన్నారు. సునీతామహేందర్‌రెడ్డి ఘన విజయానికి సహకరిస్తే ప్రత్యేక నిధులతో ఎల్బీనగర్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, సామ రమణారెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, నల్ల రఘుమారెడ్డి, రవీందర్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్ అనసూయ, రవీందర్ పాల్గొన్నారు.

మత సామరస్యం కాంగ్రెస్ విధానం..

వనస్థలిపురం: మత సామరస్యం, స్వేచ్ఛ, సమానత్వం కొనసాగించడమే కాంగ్రెస్ విధానమని, వాటిని రక్షించుకోవాలన్న ప్రధాన ఎజెండాతోనే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ భారత్ జోడో న్యాయ యాత్రను చేపట్టారని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డిలతో కలిసి ఆయన వనస్థలిపురం, బీఎన్ రెడ్డి నగర్ డివిజన్లలోని పలు చర్చిలను సందర్శించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఎంపీ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ, తనను గెలిపించి ఐదేళ్లు సేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు. రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, వజీర్ ప్రకాష్‌గౌడ్, భాస్కర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి


ఎన్టీఆర్‌నగర్‌లో మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి, వేదికపై దేప భాస్కర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడి పని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్, టెలిఫోన్ కాలనీలో చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కార్నర్ మీటింగ్స్ నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ, మోదీ ప్రభుత్వం అధికారం చేపట్టి పదేళ్లు గడుస్తున్నా నిరుపేదల బతుకల్లో మార్పు రాలేదని, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని, హస్తం గుర్తుకు ఓటు వేసిన తనను చేవెళ్ల ఎంపీగా గెలిపించాలని కోరారు. రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్ రెడ్డి కోరారు. సమావేశంలో యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, రామకృష్ణ పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత టీపీసీసీ ఎన్నికల ఇన్‌ఛార్జి నిజాంముద్దీన్, నేరెళ్ల శారద, అమరేందర్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ అనిత హరినాథ్‌రెడ్డి, రమేష్ నేత పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలి


హనుమన్ జయంతి పోస్టర్‌ను విడుదల చేస్తున్న యశ్పాల్‌గౌడ్ తదితరులు

నాగోలు: హనుమాన్ జయంతి సందర్భంగా ఈనెల 23న కొత్తపేట హనుమాన్ యువసేన ఆధ్వర్యంలో కొత్తపేట డివిజన్ బాలాజీనగర్ నుంచి శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు యువసేన అధ్యక్షుడు యశ్పాల్ గౌడ్ తెలిపారు. ఆదివారం మోహన్‌నగర్‌లో హనుమాన్ జయంతి కార్యక్రమం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా యశ్పాల్‌గౌడ్ మాట్లాడుతూ, ఈనెల 23 సాయంత్రం 5 గంటలకు పూజా కార్యక్రమం, 6 గంటలకు హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తామన్నారు. యాత్ర మోహన్‌నగర్ బాలాజీ నగర్ కాలనీ నుంచి ప్రారంభమై మోహన్ నగర్ చౌరస్తా, కమర్షియల్ టాక్స్ కాలనీ, కొత్తపేట విలేజ్, ఓల్డ్ మారుతీ నగర్ చౌరస్తా, బాబు కాంప్లెక్స్ ఇంద్రానగర్, చైతన్యపురి మీదుగా రామాలయం టెంపుల్ వరకు శోభాయాత్ర కొనసాగుతుందన్నారు. యువకులు, మహిళలు యువజన సంఘాలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొని యాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో హనుమాన్ యువసేన నాయకులు కిరణ్ కుమార్, తరుణ్, సంపత్, వెంకటేష్, వినోద్, గౌరవ, అభినయ, విష్ణు, మల్లికార్జున్, గొల్లపల్లి రాజు, అభినయ, చింటూ పాల్గొన్నారు.

మహిళా మోర్చా అధ్యక్షురాలిగా బండి పద్మ



రామంతపూర్: మేడ్చల్ మల్కాజగిరి జిల్లా బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలిగా రామంతపూర్‌కు చెందిన బండి పద్మ నియమితులయ్యారు. ఈమేరకు ఆదివారం మహిళా మోర్చా విభాగం జారీ చేసిన నియామక పత్రాన్ని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్‌తో కలిసి కార్పొరేటర్ బండారు శ్రీవాణి ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ.. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన కన్వీనర్ మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌లకు ధన్యవాదాలు తెలిపారు.